









బాలుడా.. గోపాలుడా.!

లోకాల పాలుడా.!

కృష్ణం వందే జగద్గురుం!

కనుల పండువగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో కనుల పండువగా జరిగింది. ఇళ్లు, గుళ్ల పూజలు పునస్కారాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కాచిగూడ వీరన్నగుట్టలో శ్యామ్ బాబా ఆలయంలో వేడుకలు జరిగాయి. శ్యామ్‌మందిర్ సేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి బాబాను దర్శించుకున్నారు. నల్లకుంట ప్రశాంత్‌నగర్‌లోని కుసుమ హరనాథ ఆశ్రమంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉదయం సామూహిక గీత పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. సాయంత్రం రాధాకృష్ణుల సంకీర్తన, ఊయల సేవ, నిత్య సేవలు జరిగాయి.

– అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం




హైమావతి పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్ని రాధాకృష్ణులు



సామూహిక విష్ణు సహస్రనామ, గీతాపారాయణంలో భక్తులు



శ్యామ్‌బాబా మందిర్‌లో జరిగిన పూజలు అర్చకులు, భక్తులు



శ్రీకృష్ణ తత్వాన్ని అనుసరించాలి



చిక్కడపల్లిలోని శ్రీకృష్ణ దేవాలయంలో జరిగిన పూజలో డాక్టర్ కేవీ రమణాచారి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లిలోని శ్రీకృష్ణ మందిరంలో జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి డాక్టర్ కేవీ రమనాచారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణోత్సవాన్ని జరుపుకుంటున్న శ్రీకృష్ణ మందిర నిర్వాహకుడు డా. త్రిమూర్తుల గౌరీశంకర్‌ను ఆయన అభినందించారు. శ్రీకృష్ణ తత్వాన్ని మనసా వాచా ఆచరిస్తే ప్రతి కుటుంబంలో సంతోషం, విజయాలు చేకూరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.గోపాలకృష్ణ, సాధన నర్సింహాచారి, డాక్టర్ రఘుశ్రీ, వి.జనార్ధన్‌రావు, నవనీతరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

బీఎల్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్స్, సిబ్బంది నియామకాలు చేపట్టాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని బీఎల్పీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలో వైరల్ ఇన్‌ఫెక్షన్, డెంగీ వ్యాధితో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు, ఇద్దరు చిన్నారులతో పాటు ఇతర జిల్లాల్లో చాలామంది మృత్యువాతపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా, మండల, గ్రామ పంచాయతీ పరిధిలో హెల్త్, రెవెన్యూ ప్రభుత్వ శాఖలతో పాటు ప్రైవేటు డాక్టర్లు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృతంగా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు.

క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి



అంబర్‌పేటలో స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనరెడ్డి, వీహెచ్

అంబర్‌పేట: అంబర్పేటకు క్రీడా మైదానాల అభివృద్ధికి చేయూత నివ్వాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డిని కోరారు. సోమవారం అంబర్‌పేటలోని ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్, జిమ్ము, క్రికెట్ మైదానాన్ని వారు పరిశీలించారు. క్రీడా మైదానంలో ఉన్న సమస్యలను శివసేనారెడ్డికి వివరించారు. ఇండోర్ స్టేడియం శిథిలావస్థలోకి చేరుతోందని దానికి మరమ్మతులతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. క్రీడాకారులకు కావాల్సిన క్రీడా సామగ్రి అందించాలన్నారు. అంబర్‌పేటలో ఉన్న క్రీడా మైదానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, నాయకులు జ్ఞానేశ్వర్‌గౌడ్, లక్ష్మణ్ యాదవ్, శంభూల శ్రీకాంత్‌గౌడ్, కోతం అనిల్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మసూద్ స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ఆరు డివిజన్లను సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అక్రమ కట్టడాలపై సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న చర్యల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. చెరువుల, బఫర్‌జోన్‌లలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రాతో కూల్చివేస్తూ అక్రమదారుల ఆటలు కట్టిస్తున్నారని అన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రిలో బోనాలు



నల్లకుంట: నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి(డీడీహెచ్) ఆవరణలో ఉన్న అమ్మవారి ఆలయంలో సోమవారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఉద్యోగులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు.

హైడ్రాకు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలి

టీపీసీసీ కార్మిక విభాగం కార్యదర్శి వీవీ రవీంద్రనాథ్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న వీవీ రవీంద్రనాథ్‌నాయుడు

ముషీరాబాద్: జంట నగరాలలోని చెరువులు, నాలాలను పరిరక్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన హైడ్రా సంస్థకు అందరూ మద్దతు ఇవ్వాలని టీపీసీసీ రాష్ట్ర కార్మిక విభాగం కార్యదర్శి వీవీ రవీంద్రనాథ్‌నాయుడు కోరారు. హైడ్రా సంస్థ చేపడుతున్న అక్రమ కూల్చివేతలను అడ్డుకునేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు ప్రయత్నించడం విడ్డూరంగా ఉందని ఆయన ఆరోపించారు. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జంట నగరాలలో అనేక చెరువుల స్థలాలు, నాలాల స్థలాలను బీఆర్ఎస్ నేతలు కబ్జా చేశారన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమించిన వారిలో అధిక శాతం బీఆర్ఎస్ నేతలు ఉన్నందుకే వారు హైడ్రాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అన్నారు. వర్షాకాలంలో నీటి ముంపు సమస్యలు లేకుండా చూడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. హైడ్రా చేపడుతున్న ఈ బృహత్కర కార్యక్రమానికి ప్రజలందరూ మద్దతు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బీహెచ్ ఉమేష్, సీవీ రఘునందన్‌రావు, జి.రాజ్‌కుమార్, సి.సత్యనారాయణ, సుశీల్‌గాంధీ, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ రావు

నల్లకుంట: మనం పర్యావరణాన్ని కాపాడితే.. పర్యావరణం మనల్ని కాపాడుతుందని ప్రభుత్వ సలహాదారు సీహెచ్ వేణుగోపాల్ రావు అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ(టీబీఎస్ఎస్), బ్రాహ్మణ విద్యార్థి వసతి గృహం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వనమహోత్సవం జరిగింది. సోమవారం న్యూ నల్లకుంటలోని వసతి గృహం ఆవరణలో ఆయన నిర్వాహకులతో మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ జీవిత కాలంలో కనీసం రెండు మొక్కలైనా నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెనోవా ఆస్పత్రి డైరెక్టర్ డా. టీవీ.నాగేష్, టీబీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.సురేష్ చందర్ రావు, న్యాయవాది బలవంత్‌రావు, సురేష్, హాస్టల్ ఇన్‌చార్జి ప్రకాశ్‌రావు, హైకోర్టు న్యాయవాదులు శ్రీకాంత్, సీహెచ్. విశ్వేశ్వరరావు, మహేష్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు అజయ్ కుమార్, బి.శ్రవణ్‌కుమార్, శరత్, సీహెచ్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భూములను దక్కించుకోవడానికి పోరాటం చేయాలి

టీజేఎస్ నగర అధ్యక్షుడు నర్సయ్య



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో అన్యాక్రాంతమైన దళితులు, బలహీన వర్గాల భూములను దక్కించుకోవడానికి పోరాటం చేయాలని టీజేఎస్ నగర అధ్యక్షుడు నర్సయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ భూ రక్షణ సమితి, డీబీఎఫ్, తెలంగాణ అంబేడ్కర్ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ... అసైన్డ్ భూములకు హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా అమలు చేయడానికి ఒక అధ్యయన కమిటీ వేయాలని కోరారు. ధరణితో అనేక మంది పేదలు నష్టపోయారన్నారు. అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించడానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించాలన్నారు. ధరణిలో మార్పులు చేయడానికి ఆర్‌వోఆర్ చట్టాన్ని అధ్యయనం చేయాలన్నారు.

- ప్రొఫెసర్ ఇటుకాల పురుషోత్తం మాట్లాడుతూ.. ఇళ్లు లేని ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.6లక్షల అందజేయాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చి బలహీన వర్గాలను ఆదుకోవాలన్నారు. తెలంగాణ భూ రక్షణ సమితి అధ్యక్షుడు బుగ్గ మైసయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీపుల్స్ మానిటరింగ్ కమిటీ కన్వీనర్ శివలింగం, ఇటుకాల లింగం, వివిధ సంఘాల నాయకులు బండారు అశోక్‌వర్ధన్, బీఎల్ రమేష్, ఏకు సారయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంతి సెప్టెంబర్ 3న

చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ రాగసప్తస్వరం ఆధ్వర్యంలో తిరుమల గ్రూప్, సీల్‌వెల్ కార్పొరేషన్‌ల సౌజన్యంతో ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వర్‌రావు శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకురాలు వీఎస్ రాజ్యలక్ష్మి తెలిపారు. రవీంద్ర భారతిలో సెప్టెంబర్ 3న శత జయంతి వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు.

బీజీయూఎస్ కవాడిగూడ కన్వీనర్‌గా అనిల్‌కుమార్



అనిల్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న వినయ్‌కుమార్

కవాడిగూడ: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (బీజీయూఎస్) కవాడిగూడ కన్వీనర్‌గా బాణాల అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ముషీరాబాద్ కన్వీనర్ వినయ్‌కుమార్ సోమవారం ఆయనకు నియమాకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో కవాడిగూడ కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన ఉత్సవ సమితి నాయకులకు అనిల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



అంబర్‌పేట: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ, యాకుత్‌పుర రైల్వే స్టేషన్ల మధ్య ఉదయం 5.30గంటలకు ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటాయన్నారు. నీలి రంగు గీతాల చొక్కా, నీలిరంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడిని గుర్తిస్తే ఫోన్ నం.99122 21985కు సమాచారం ఇవ్వాలన్నారు.

శ్రీవారికి మల్లెలతో సహస్రనామార్చన

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి పవిత్రోత్సవ వేడుకలు సోమవారం ముగిశాయి. ఈ నెల 23న ప్రారంభమైన శ్రీవారి పవిత్రోత్సవాలు 26వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ముగింపు రోజు సోమవారం మల్లెపూలతో స్వామివారికి సహస్రనామార్చన నిర్వహించారు.

చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న స్కైల్యాబ్‌బాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కొత్త ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్న చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు విమర్శించారు. అంబేడ్కర్ అభయ హస్తం కోసం విధివిధానాలను తక్షణమే రూపొందించాలని కోరారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టి.స్కైల్యాబ్ బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. అంబేడ్కర్ అభయ హస్తం కోసం రూ.2వేల కోట్లను బడ్జెట్‌లో ప్రకటించారని కానీ ఆ పథకం అమలుకు మార్గదర్శకాలు రూపొందించకపోవడం విచాకరమన్నారు. దళితుల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిని వెంటనే నియమించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కేసుల బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తక్షణమే పెండింగ్ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ అధ్యక్షుడు జాన్ వెస్లీ, ఉపాధ్యక్షులు ఎం.కురుమయ్య, పాలడుగు నాగార్జున, మనోహర్, లలిత, రాంమూర్తి, పి.ఆశోక్, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మానికి ప్రతీకలు.. భారతీయ నృత్యాలు

విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్



కళాకారుల నృత్య ప్రదర్శన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సనాతన ధర్మానికి ప్రతీకలు భారతీయ నృత్యాలు అని విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ అన్నారు. సోమవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మహతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ''బృందావన చంద్రోదయం – శ్రీకృష్ణుడికి సంగీత, నృత్య నీరాజనం''కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంగీత నాట్యాచార్యులు నారాయణ పూర్ణిమ శర్మ, పసుమర్తి నర్సింహ ప్రణవ్,అంజలి, ఉదయశ్రీ, కానుకుంట్ల సౌందర్య, ఎ.శ్రీవాణి, కె.సౌజన్య, బొబ్బిలి శివాని, లింగాల నర్సింగరావులకు పురస్కారాలను అందించి సన్మానించారు. విశిష్ట అతిథిగా ప్రముఖ కూచిపూడి నాట్యగురువు డా. సజని వల్లభనేని తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముద్దుగారే యశోదా.. అలకయే శ్రీ, పుష్పాంజలి.. అదివో అల్లదివో కీర్తనలపై చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

ఘనంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ జన్మదిన వేడుకలు



ముషీరాబాద్: ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జన్మదిన వేడుకలు సోమవారం నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన కేక్‌కటింగ్, అన్నదాన కార్యక్రమాలు, పండ్ల పంపిణీ, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు, వివిధ పార్టీల నేతలు ముఠా గోపాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.




బగ్గీపై ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహను ఊరేగిస్తున్న బీఆర్ఎస్ నాయకులు